క్లుప్తంగా

సోలార్ రాయితీపై ప్రచారం



సోలార్‌పై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

దెందులూరు: కేంద్ర ప్రభుత్వం సోలార్‌కు ఇస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకుని విద్యుత్ బిల్లు ఇబ్బందులు లేకుండా జీవించాలని విద్యుత్ శాఖ గ్రామ గ్రామాన కళాకారులు ప్రజాప్రతినిధులు స్వచ్ఛంద సంస్థలతో కలిసి ప్రచారం చేస్తున్నారు. గురువారం గోపన్నపాలెంలో మెయిన్ సెంటర్‌లో ప్రచారం చేశారు. విద్యుత్ శాఖ దెందులూరు మండలం అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాస్, గోపన్నపాలెం మాజీ గ్రామ సర్పంచ్ కొండేటి హనుమంతు, గ్రామ నాయకులు కళాజాత సభ్యులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల్లో తనిఖీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని వివిధ విద్యా సంస్థల బస్సులను గురువారం రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని బస్సులపై కేసులు నమోదు చేశారు. గడువులోపు ఫిట్నెస్ చేయించి వాహనాన్ని కండీషన్‌లో ఉంచాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బొద్దు నాయక్ ఆదేశించారు. స్థానిక సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్ ప్రాంతంలో తనిఖీలు చేసిన సందర్భంలో పరిమితికి మించి విద్యార్థులను తిప్పుతున్న వాహనాలకు చలానాలు రాసి అపరాధ రుసుం విధించారు.

షుగర్ పరీక్షలు తప్పనిసరి



షుగర్ పరీక్షలు చేస్తున్న లయన్స్ సభ్యులు

గణపవరం: షుగర్ వ్యాధి వయస్సుతో నిమిత్తం లేకుండా అందరినీ వేధిస్తోందని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా షుగర్ పరీక్షలు చేయించుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పచ్చిపులుసు నాగేశ్వరరావు, కె.విశారద అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం గణపవరంలో కళాశాల విద్యార్థులు సుమారు 200 మందికి షుగర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. కొందరికి షుగర్ లక్షణాలు కనిపించడంతో తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. హెచ్‌బీ పరీక్షలు కూడా నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ జోన్ చైర్మన్ కె.సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో గోనె సంచులు

పెదపాడు : రైతు సేవా కేంద్రంలో గోనె సంచులు అందుబాటులో ఉన్నట్టు తహసీల్దార్ ఎ.కృష్ణ జ్యోతి తెలిపారు. కొత్తూరు గ్రామ రైతులు చిరిగిన గోనె సంచులు ఇచ్చారని తమ దృష్టికి రావడంతో మంచి సంచులను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు

ప్రశస్తతో విద్యార్థులకు ప్రయోజనం

- శరవేగంగా వైకల్యాల గుర్తింపు సర్వే
- ఈ నెలాఖరుకు పూర్తయ్యే అవకాశం
- అర్హులకు వైద్య చికిత్సలతో పాటు పింఛన్ సదుపాయం
- ఏలూరు నియోజకవర్గంలో 504 మంది గుర్తింపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు పెద్దలు. ప్రతి వ్యక్తీ వ్యాధులకు గురికాకుండా జీవించాలని భావిస్తాడు. కొందరు వంశ పారంపర్యంగా సంక్రమించే వ్యాధులకు గురౌతుండగా, మరికొందరు జన్యు లోపాలతో అనారోగ్యం బారిన పడుతుంటారు. అన్ని వైకల్య లక్షణాలు బయటకు తెలియవు. ముఖ్యంగా మానసిక లోపాలు పైకి కనిపించవు. విద్యార్థులతో నిరంతరం కలిసి ఉండే ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సహకారంతో ఇలాంటి లోపాలను ముందుగానే గుర్తిస్తే.. చిన్నారులకు త్వరగా నివారణ చర్యలు తీసుకోవచ్చన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానానికి అనుకూలంగా ప్రశస్త (ప్రీ అసెస్మెంట్ హోలిస్టిక్ స్క్రీనింగ్ టూల్) యాప్‌ను రూపొందించి, సర్వేను ప్రారంభించింది. విద్యార్థుల్లో ఉన్న శారీరక, మానసిక వైకల్యాలను సకాలంలో గుర్తించి వైద్యం అందిస్తే వారు త్వరగా మామూలు పరిస్థితికి రాగలరన్నదే ఈ సర్వే ప్రధాన ఉద్దేశం. బాధితులను గుర్తించి వారికి ఉచిత వైద్య సేవలు, పింఛను సదుపాయం కల్పించేందుకు ఈ సర్వే తోడ్పడుతుంది. గత విద్యా సంవత్సరంలో కొంత మేర సర్వే చేశారు. సత్ఫలితాలు రావడంతో పూర్తిస్థాయిలో ఈ



సర్వే అంశాలను యాప్‌లో నమోదు చేస్తున్న ఐఈఆర్‌టీలు

ఏడాది జూన్ నెల నుంచి ఈ సర్వే ప్రక్రియను అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగిస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసే విధంగా సర్వశిక్ష జిల్లా సహిత విభాగం హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సహకారంతో చర్యలు చేపట్టింది.

రెండు దశల్లో సర్వే

ప్రశస్త యాప్‌లో మొదటిగా స్కూల్ హెడ్ మాస్టర్ పిల్లల వైకల్యాలను పొందుపరుస్తారు. ఆ తర్వాత ఐఈఆర్టీలు పిల్లల వద్దకు వెళ్లి సర్వేలో పొందుపరిచిన వివరాలు సరిగా ఉన్నాయో లేదో తనిఖీ చేస్తారు. శిక్షణ పొందిన ఎడ్యుకేటర్లు వైకల్యం ఉన్న విద్యార్థుల వివరాలను సరిచూసుకొని ఆన్‌లైన్‌లోనే సర్టిఫై చేస్తారు. ఏలూరు నియోజకవర్గంలో 14,939 మంది విద్యార్థులు ఉండగా, ఇప్పటి వరకూ 10,529 మందిని సర్వే చేసి ఆ వివరాలను యాప్‌లో నమోదు చేశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు 504 మందిని గుర్తించారు. మరో 4,410 మందిని సర్వేచేయాల్సుంది.

సర్వేలో పరిశీలించే అంశాలు

విద్యార్థి తన పనులు తాను చేసుకుంటున్నాడా? మాటలు ఎలా వస్తున్నాయి? కాళ్లు, చేతుల పని తీరు? తల ఎలా ఉంది? పొడువు, పొట్టి చేతివేళ్లు మొదలైన వివరాలను యాప్‌లో పొందుపరుస్తున్నారు. విద్యార్థి చదువు, చూపు ఏ విధంగా ఉంది? బ్లాక్ బోర్డు సరిగా కనిపిస్తుందా లేదా, తరగతి గదిలో తోటి విద్యార్థులతో అతడి ప్రవర్తన ఎలా ఉంది? ఉపాధ్యాయుల సూచనలను పాటిస్తున్నాడా లేదా? వంటి 21 అంశాలపై ఆరా తీసి వివరాలు నమోదు చేస్తున్నారు.

పిల్లలకు నిరామయ హెల్త్ ఇన్సూరెన్స్

ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు 21 వైకల్య పరిస్థితులను ప్రస్తావిస్తూ ఎన్‌సీఈఆర్‌టీ ప్రశస్త యాప్‌ను రూపొందించింది. ఈ సర్వే శరవేగంగా సాగుతోంది. పార్ట్–ఏలో తరగతి ఉపాధ్యాయులు 63 ప్రశ్నల ద్వారా విద్యార్థుల ప్రవర్తనను పరిశీలిస్తారు. పార్ట్–బీలో మరిన్ని భిన్నప్రవర్తనలు గల విద్యార్థులను స్పెషల్ ఎడ్యుకేటర్లు గుర్తిస్తారు. మేధోపరమైన వైకల్యం, సెరిబ్రల్ పాల్సీ, ఆటిజం, మల్టిపుల్ డిజేబిలిటీ గల పిల్లలకు నిరామయ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది.

నెలాఖరు నాటికి సర్వే పూర్తి చేస్తాం



విద్యార్థుల్లోని వైకల్యాల గుర్తింపు సర్వే వేగవంతంగా నిర్వహిస్తున్నాం. దాదాపు 85 శాతం సర్వే పూర్తి చేసి ప్రశస్త యాప్‌లో నమోదు చేశాం. మిగిలిన 15 శాతం ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయడానికి ఐఈఆర్‌టీలు, ఉపాధ్యాయులకు తగిన సూచనలు జారీ చేశాం. సర్వే పూర్తయితే ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల లెక్క తేలుతుంది. వీరికి ప్రత్యేక సదుపాయాలు కల్పించడంతో పాటు పింఛన్లు కూడా వచ్చే అవకాశం ఉంటుంది.

– రూపావతు రంగయ్య, ఎంఈఓ–2

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కోటదిబ్బ, మెయిన్ బజారు, పాండురంగ థియేటర్ ప్రాంతం, అగ్రహారం, మార్కెట్, కెనాల్ రోడ్డు, సత్యనారాయణ పేట, లంబాడీ పేట, వెన్నవల్లివారి పేట, బావిశెట్టివారి పేట, నల్లదిబ్బ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. అలాగే అశోక్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో డాక్టర్ రాజగోపాల రావు వీధి, కేహెచ్‌ఎన్ కళాశాల రోడ్డు, ఉప్పు రామారావు వీధి, పెట్రోల్ బంక్ ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

క్రాంతి కుమార్ బహిష్కరణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): క్రమశిక్షణకు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న జిల్లా సహాయ కార్యదర్శిగా ఉన్న ఎం.క్రాంతికుమార్‌ను విప్లవ విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ నుంచి బహిష్కరించినట్టు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నాని, ఎస్ మహర్షి తెలిపారు. వ్యక్తిగత ఏజెండాతో పాటు ఇతర సంఘాలతో రహస్య సంబంధాలు కొనసాగిస్తున్న క్రాంతి కుమార్ ప్రాథమిక సభ్యత్వం రద్దు చేశామని పేర్కొన్నారు. త్వరలో సంఘం నూతన కమిటీ ఎన్నుకుంటామని తెలిపారు.

పోస్టాఫీసుల వద్ద సందడి





కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటిలోని మహిళకు రూ.1500 ఇస్తామని వాగ్దానం చేసింది. పోస్టాఫీసు ఖాతా తెరిచి, ఆ రశీదు బ్యాంకులో చూపిస్తే తమ ఖాతాలోకి ప్రభుత్వం ప్రకటించిన రూ.1500లు జమ అవుతాయని చెప్పడంతో ఏలూరు నగరంలోని మహిళలు పోస్టాఫీసుకు పెద్ద ఎత్తున పరుగులు తీస్తున్నారు. ఖాతా తెరిచే వరకు అక్కడే పడిగాపులు కాస్తున్నారు. అసలు విషయమేమిటంటే, కేంద్ర ప్రభుత్వం పోస్టాఫీసులో బ్యాంకింగ్ వ్యవస్థ ఏర్పాటుకు ఖాతా తెరవాలని ఆదేశాలు ఇచ్చింది. అది తెలియక ప్రజలు ఖాతా తెరిస్తేనే డబ్బులు వస్తాయని పుకార్లు నమ్మి అవస్థలు పడుతున్నారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్ / ఏలూరు

ధాన్యం ఆరబోతకు అవస్థలు

- కల్లాల్లేక రోడ్లపైనే ధాన్యం
- సీసీ కెమెరాలతో రైతులకు భరోసా
- తేమ శాతం నిబంధనలు సడలించాలని డిమాండ్



పాతూరు హైవే ధాన్యం ఆరబోస్తున్న కూలీలు

భీమడోలు: తుఫాన్ నేపథ్యంలో ధాన్యంలో తేమ శాతం తగ్గించుకోవడానికి అన్నదాతలు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. వరి క్షేత్రాల వద్ద సామూహిక కల్లాలు లేకపోవడంతో ధాన్యాన్ని జాతీయ, రాష్ట్రీయ రహదారులపై ఆరబోసుకుంటున్నారు. భీమడోలు మండలంలో గుండుగొలను నుంచి తాడేపల్లిగూడెం, అలాగే గుండుగొలను నుంచి కొవ్వూరు వరకు ఉన్న జాతీయ రహదారులపైనే ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. ధాన్యం దొంగల పాలు కాకుండా రహదారులపై ఉన్న సీసీ కెమెరాలు రైతులకు భరోసాగా నిలిచాయి. దీంతో ఉదయం ఆరబోసిన ధాన్యాన్ని సాయంత్రం గుట్టగా ఒక చోటకు చేర్చి రైతులు వెళ్లిపోతున్నారు. 10 రోజుల పాటు రోడ్లపై ధాన్యం ఆరబోతకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాలకు వరి కంకుల నుంచి గింజ రాలిపోతుండడంతో దిక్కుతోచని స్థితిలో వరి కోత యంత్రం ద్వారా పంట మాసూళ్లు చేసి, రోడ్లపై ధాన్యం ఆరబోసుకుంటున్నారు. రహదారులపై వేలాది మెట్రిక్ టన్నుల ధాన్యం ఉంది. ధాన్యం ఆరబోతకు రోజుకు ఎకరాకు ఇద్దరు కూలీలకు రూ.1000 ఖర్చు చేస్తున్నారు. సామూహిక కల్లాలు లేని లోటును రహదారులు తీర్చుతున్నాయని రైతులు చెబుతున్నారు. అధికారుల నుంచి ఎటువంటి భరోసా లేదని, సీసీ కెమెరాలే తమ ధైర్యమని వివరిస్తున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెరిగిందని వాపోతున్నారు. తేమ శాతం నిబంధనలను సడలించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు అధికారులను కోరుతున్నారు.



ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న రైతులు

కల్లాలకు ప్రతిపాదనలు



వర్షాలు పడే తరుణంలో రైతులు ధాన్యాన్ని రోడ్లపైకి తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు పండించిన పంట మాసూళ్లకు సామూహిక కల్లాలు ఉంటే మేలు జరుగుతుంది. అయితే మండల పరిధిలో ఎక్కడా ఇలాంటి కల్లాలు లేవు. కల్లాల ఏర్పాటుకు అవసరమైన స్థలాల కోసం ఉన్నతాధికారుల వద్ద ప్రతిపాదనలు ఉన్నాయి.

– ఎస్‌పీపీ ఉషారాణి, ఏఓ, భీమడోలు





గుండుగొలను వద్ద హైవేపై ఆరబోసిన ధాన్యం రాశులు, జాతీయ రహదారిపై ఉన్న సీసీ కెమెరాలతో ధైర్యంగా ఉన్న రైతులు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	13
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	18
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	18
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	23
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు - తిరుపతి	16.00	4830	28

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	42	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	07, 10
బెండకాయలు	24	కంద	68
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	64
కాకర కాయలు	28–36	కీరా దోస	40
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	48	అల్లం	70
క్యాబేజీ	36	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	60–70	పాలకూర	10
దొండకాయలు	30	చుక్కకూర	10
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	36–58	గోంగూర	07
గోరుచిక్కుడు	32	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణి	--
అనపకాయ (1)	20–25	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	40

హానికారక కెమికల్స్ తరలిస్తున్న వ్యక్తులపై కేసు

భీమడోలు: హానికారక కెమికల్స్ తయారీ చేసి అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై గురువారం రాత్రి భీమడోలు పోలీసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన ముదునూరి సత్యనారాయణరాజు అనే వ్యక్తి భీమడోలు మండలం అంబర్‌పేట పంచాయతీ పరిధిలోని కొండ్రెడ్డి నగర్ శివారున లైసెన్స్ లేకుండా పాతటైర్ల నుంచి ఆయిల్ తీసి, దానిని అదే గ్రామానికి చెందిన దంపన బోయిన ఆంజనేయులు ద్వారా హైదరాబాద్‌లోని కృష్ణ అనే వ్యక్తికి సరఫరా చేస్తున్నారు. మెడికల్ వేస్ట్ లిక్విడ్‌లో కలిపి కలిసి ఆయల్‌ను తీసి వాతావరణాన్ని కలుషితం చేస్తూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగేలా అక్రమంగా వ్యాపారం చేస్తున్నాడు. హానికరమైన కెమికల్స్‌ను తయారు చేస్తున్న వారిపై భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఆర్‌సీఎం చర్చి ప్రారంభోత్సవం

దెందులూరు: అక్కిరెడ్డిగూడెంలో నిర్మించిన ఆర్‌సీఎం చర్చిని ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని నాగులదేవునిపాడు ఆర్‌సీఎం చర్చి పారిస్ ప్రీస్ట్ ఇంటి జేవియర్ అన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులందరూ పాల్గొన్నాలని కోరారు.

ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం

భీమడోలు: నజరేయుడైన ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని జంగారెడ్డిగూడెం పాస్టర్ భరత్ ఉద్బోధించారు. భీమడోలు మండల ఐక్య పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పోలసానిపల్లిలోని ఏసయ్య కృపా సన్నిధి ప్రార్థనాలయంలో సెమీ క్రిస్మస్ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసారు. క్యాండిల్ సర్వీసు నిర్వహించారు. ఏసుక్రీస్తు మహారాజుకు జైజై ధ్వనాలతో మార్మోగింది. పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ డీవీ రత్నం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రసంగీకుడు భరత్ మాట్లాడుతూ క్రైస్తవులంతా ఎంతో పవిత్రతతో, ఆనందోత్సాహాల నడుమ ఈ పండుగ నిర్వహించుకుంటారని తెలిపారు. ప్రేమ, దయ, జాలి, కరుణ కలిగిన ఏసుక్రీస్తు మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. తొలుత క్రైస్తవ గేయాలు పాడి ఆకట్టుకున్నారు. అనంతరం ప్రేమ విందు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఇంజేటి విజయ్ అచ్యుతం, కార్యదర్శి ఏషయా, కోశాధికారి విశ్వేశ్వరరావు, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులు వెలిగించి క్రీస్తు గేయాలు ఆలపిస్తున్న పాస్టర్లు, విశ్వాసులు

పింఛన్ దరఖాస్తుల్లో నిబంధనలను సడలించాలి

భీమడోలు: మంచానికే పరిమితమైన దివ్యాంగులకిచ్చే పింఛన్ల దరఖాస్తుల్లో నిబంధనలను సడలించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం, జిల్లా నాయకులు ఏలూరులో గురువారం ఆ శాఖ ఏడీ బి.రామ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఎంపీ పుట్టా మహేష్ కార్యాలయ ప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. నరాలు చచ్చుపడి మంచం పట్టి నడవలేని స్థితిలో ఉండి 85 శాతం కన్నా ఎక్కువగా వైకల్యం ఉందని సదరం ధ్రువీకరణ పత్రం పొందిన దివ్యాంగులకు నెలకు రూ.15 వేల పింఛన్ అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామని పేర్కొంది. డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి దరఖాస్తులు తీసుకెళ్లగా సదరం ధ్రువీకరణలో నిర్ధారించిన శాతం ఉన్నా న్యూరాలజిస్ట్ సంతకం చేయించాలని నిబంధన పెడుతున్నారని నాయకులు తెలిపారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని న్యూరాలజిస్ట్ లేరని, విషయాన్ని డీఎంహెచ్‌ఓ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లగా విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేయించుకోవాలని చెబుతున్నారని వివరించారు. విజయవాడ వెళితే వేరే జిల్లా వారికి ధ్రువీకరణ చేయబోమని చెప్పడంతో జిల్లాలో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏలూరు ఆసుపత్రిలో న్యూరాలజిస్ట్ పోస్టును భర్తీ చేయించాలని, లేని పక్షంలో సదరం ఆధారంగా అవకాశం ఇవ్వాలని నాయకులు కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఏడీ బి.రామ్ కుమార్ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.



ఏడీ రామ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు